# "దేవుడు మీకు మేలు చేయాలి"

కృష్ణ

రెండు సంవత్సరాల తరువాత స్వదేశానికి వచ్చేను. నాతో బాటు మిత్రుడు ఖదీర్‌ఖాన్ గూడా వచ్చేడు. బొంబాయిలో దిగేక నేను రైల్లో వెళ్లాలన్నాను. అతను నచ్చజెప్పాలని ప్రయత్నించేడు గాని నేను నా నిర్ణయాన్ని మార్చుకోలేకపోయాను. చివరకు 'నా కర్మకు నన్నొదిలి' అతను విమానంలో హైదరాబాదు వెళ్లిపోయాడు.

ఎంత యాతన- ఎన్ని తిప్పలు బడ్డాడో గాని నేను దిగిన హోటలు గుమాస్తా త్రీటయెర్ టికట్ తెచ్చి పెట్టేడు. ఎగాదిగా నన్ను అదోలా చూస్తూ "ఏసీగాని విమానం టికెట్సుగాని దొరకడం యింతకంటె చాలా సులభంసార్!" అన్నాడు.

చాలాకాలం తరువాత ప్లాట్‌ఫాం మీద- ఆ జన సందోహంలో బుజాలు బుజాలు రాసుకు తిరుగుతుంటే నాకు ఏంతహాయి అన్పించింది. మనుషులు ఒకళ్ల నొకళ్లట్లా రాసుకు తిరుగుతుంటే సోదరభావం- సహజీవన ధోరణీ అలవడతాయేమో!నన్పించింది- అయస్కాంతంపై రాయగా రాయగా ఇనుపముక్కకి గూడా ఆ స్వభావం అబ్బినట్లు.

నేను అమెరికా వెళ్లి పదిహేనేళ్లయింది. ఆరెగన్‌లోని ఒక భౌతిక శాస్త్ర పరిశోధనాలయంలో ఉపసంచాలకునిగా పని చేస్తున్నాను. స్వదేశంలో నాకు తెలిసినంతవరకు నా రక్త సంబంధీకు లెవరూ లేరు. పొత్తిళ్లనాటి నుంచీ అనాధాశ్రమంలోనే వున్నాను. ఆ దగ్గర్లోనే వున్న ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి వరకు చదివి ప్రథమశ్రేణిలో పాసైనాను. ఉపకారవేతనం వచ్చింది. పీయూసీలో. క్లాసువచ్చింది. నా కిష్టమైన ఫిజిక్సు సబ్జక్టు కోసం ఇంజనీరింగు వదలుకుని బీయస్సీ, ఎమెస్సీ చదివి ఇరవైమూడో సంవత్సరం నిండేసరికి డాక్టరేట్ పొందేను. ప్రతిభను గుర్తించడమే తప్ప మరో పరిగణన లేని ప్రొఫెసరుగారి ఔదార్య ప్రోద్బలాలతో స్కాలర్‌షిప్ పొంది అమెరికా వెళ్లి పోస్ట్ డాక్టొరల్ రీసెర్చి చేస్తూ- యిటీవలే పరిశోధనాలయం ఉపసంచాలకుణ్నైనాను.

నాటి నుంచి నేటివరకు ఉత్తర ప్రత్యుత్తరాల ద్వారా మైత్రీబంధాన్ని కొనసాగిస్తున్న కొందరు స్నేహితులను చూడటానికే నేను హైదరాబాదుకు రావడం. చిన్ననాటి నుంచి ఆర్థిక – సామాజిక సమీకరణ సూత్రాల్ని తిరస్కరించి చెలికాళ్లుగా కొనసాగుతూ వచ్చి ఆత్మబంధువులుగా స్థిరపడిపోయిన వాళ్లను చూసుకోడానికీ తమ దృష్టిలో నా సాంఘికస్థాయి ఎదిగిపోవడంతో దారిలోనే జారిపోయిన పందరివంటి చిన్ననాటి మిత్రులను వెదుక్కోటానికీ- ఇందుకే నేను హైదరాబాదు రావడం.

రైల్లో నిద్రపట్టలేదు. పక్కనున్న బెర్తుల వాళ్లు నిద్రకోసం పిచ్చి ప్రయత్నాలేమీ చెయ్యకుండా పేకాడుతూ కూర్చున్నారు. వాళ్ల ముఖాల్లోని ఉత్సాహ ఉద్రిక్తతల్ని పరిశీలిస్తూ కూర్చున్నాను.

అప్పుడప్పుడు నా మనస్సులో ఒక ఆలోచన తలెత్తుతూంటుంది.

తలితండ్రులు, రక్త బంధువులు వున్నవ్యక్తి చాలాకాలపు ఎడబాటు తరువాత వాళ్ళని కలుసుకునేటప్పుడు వాళ్ళపట్ల ఎట్లా ప్రతిస్పందిస్తాడు? ఆ స్పందన – లేక – 'ప్రతిస్పందనలతో వాళ్ళ బాడీ కెమెస్ట్రీలో ఎట్లాంటి మార్పులువస్తాయి?

ఆ వెంటనే మరో ఆలోచనా వచ్చేది. తన వాళ్ళంటూ ఎవరూలేని నా వంటి 'పుట్టు అనాధ మనస్సులో రక్త బాంధవ్యానికి ప్రతిస్పందించే భావకేంద్రం అంటూ ఒకటుంటుందా?' అనే ప్రశ్న నా మిత్రుల్లో ఒక రిద్దరి మనస్సుల్లో నైనా తలెత్తి వుండదా?


ఆరున్నరకు నాంపల్లి చేరింది బొంబాయి ఎక్స్‌ప్రెస్.

ప్రయాణికులు దిగటానికి వరుసగట్టేరు. నేనూ వరుసలో నిల్చుని ఉత్సుకతతో ప్లాట్‌ఫారంవైపు చూశాను.

అందుకోసమే ఎదురు చూస్తున్నట్లు నా కన్నులు ఒక వ్యక్తిపై నిలిచిపోయాయి.

ఉరుదూలో "బాబా – దేవుడు మీకు మేలుచేయాలి. ఈ దురదృష్టవంతురాలైన అనాథకు





కాస్త సాయం చేయండిబాబా!" అంటూ దీనంగా యాచిస్తోంది. బురఖా వేసుకునుంది. రూపం కన్పించకపోయినా గొంతు వార్ధక్యాన్ని స్పష్టంగా తెలియబరుస్తోంది.

దిగి సూట్‌కేస్ లాక్కుంటూ నడిచేను. నా చూపుమాత్రం కాసేపు లంగరువేసిన పడవలాగ ఆ వ్యక్తిదగ్గరే తొణకులాడింది.

అదేదో పరిచిత స్వరంలా విన్పిస్తూంది. కంఠస్వరం కంటే ఆ స్వరంతో అనుస్వరంలా విన్పించే దైన్య నాదం 'మునుపెన్నడో విన్నదే యీ గొంతు' అన్పించేలావుంది.

చేతికొచ్చిన నాణేన్ని ఆమె చేతిలోని టిన్నులో వేశాను.

"జీతేరహో బేటా!" అన్నదామె. మంత్రంలా నన్ను ముగ్ధుణ్ణి చేసిందా దీవెన!

హైదరాబాదులో మూడు రోజులు మూడు గంటల్లా గడిచిపోయాయి. ఉదయం ఒక మిత్రునింటా, రాత్రి మరొక మిత్రునింటా భోజనం. వాళ్ళ కుటుంబ సభ్యులూ - పిల్లలమధ్య ఆహ్లాదాన్ని పొందేను.

రాత్రి హొటల్ రూమ్‌కి వచ్చి పడుకోబోయేముందుమాత్రం ఆ వృద్ధ భిక్షుకి గొంతు గుర్తుకు వచ్చేది. 'దేవుడు మీకు మేలు చేయాలి' అని దీవించినంతమాత్రాన అంతా మేలే జరుగుతుందా? 'చిరంజీవ' అన్నంత మాత్రాన వందేళ్ళు జీవిస్తామా? నిజమే ఒప్పుకుంటాను. అయితే ఆ మాటల్ని ఆ వృద్ధురాలు గుండెలోతుల్నుం చెక్కణుంచో తోడి తెచ్చినట్లన్పించి నాకు వొళ్ళు జలదరిస్తుంది.

ఏడింటికల్లా ఖదీర్‌ఖాన్ వచ్చేడు. రాత్రి భోజనానికి తమ యింటికి తీసుకుపోడానికి.

హొటల్‌మెట్లు దిగి కారుదగ్గరకు నడుస్తూ టక్కున ఆగిపోయాము.

అదే కంఠం! "అల్లా మీకు మేలుచేయాలి - ఈ దురదృష్టవంతురాలిపై కనికరం చూపించండి బిడ్డా!"

గోడకి చేరగిలబడివుంది బురఖావేసుకున్న ఆ వృద్ధ భిక్షుకి.

మేము చెరొక రూపాయి వేశాము.

"అల్లా మాకు కాస్తోకూస్తో మేలుచేశాడు - నీకూ కాస్త మేలుచేయాలని మా కోరిక - అల్లా యీ కష్టాల్నుంచి నిన్ను గట్టెక్కించుగాక!" అన్నాడు ఖదీర్ దయనిండిన గొంతుతో.

"నిజం - నిజం - తప్పక భగవంతు డీమెను అనుగ్రహించాలి" అన్నాను నేనూ.

కారులో మేం వెళ్తూంటే ఆమె ఆశీర్వాదం విన్పిస్తూనేవుంది.

ఆ రాత్రి నా బాల్య స్నేహితులందర్నీ గుర్తుచేసుకున్నాను. నాతో బాటు అనాధాశ్రమంలో వుండి చదువు అబ్బక మానేసినవాళ్ళు, పదో తరగతి వరకు చదివి ఎక్కడో చిల్లరపనులకు కుదిరి ఆశ్రమాన్ని వదలినవాళ్ళు - అంతా గుర్తుకువచ్చేరు. అందులో యిప్పుడు ఎవరెవరు ఎక్కడవున్నారో! ముఖ్యంగా మిత్రుడు పండరి - ముషీరాబాదు నుంచి స్కూలుకు వచ్చేవాడు. వాళ్ళ యింటికి తరచూ నన్ను తీసుకెళ్తూండేవాడు. చాలసార్లు వాళ్ళింట్లో అన్నం తిన్నాను గూడా. చదవడానికి శాయశక్తులా ప్రయత్నించి విఫలులైన వాళ్ళలో అతనూ వొకడు. తనకంటే నేను రెండేళ్ళు చిన్న. అయినా మేం కలుసుకున్నప్పుడు అతనిలో కన్పించే వినమ్రధోరణి నన్ను సిగ్గుపడేలా చేసేది. నేనొక్కణ్ణేగాదు. బాగా చదువు అబ్బుతున్న పిల్లలెవర్ని చూసినా అతనిలో అప్రయత్న గౌరవభావం కలిగేది. నేను బి. ఎస్ సి. చివరి సంవత్సరం చదువుతూండగా చివరిసారి చూశాను అతన్ని. మెట్రిక్ పరీక్ష ఆఖరుసారిగా రాస్తూ లెక్కలు చెప్పించుకోడానికి సైకిలేసుకుని హాస్టలుకు వచ్చేడు.

మర్నాడుదయం హొటలుకు వచ్చిన మిత్రుడు విజయబాబుతో అన్నాను- "పండరి గుర్తున్నాడా నీకు? ముషీరాబాదు నుంచి వచ్చేవాడు."

తలూపేడు విజయబాబు- "బాగానే గుర్తుపెట్టుకున్నావే!"

"ఇప్పు డెక్కడున్నాడో యేమైనా తెలుసా?"

విజయబాబు చూపు చిట్లింది- "అతను పోయా

దన్నారు."

"పోయాడా?! గ్నాడ్! ఏమైంది?"

"ఏదో రోగమయ్యుంటుంది నామకః- నిజానికి మన దేశంలో చాలా మంది లాగ దారిద్ర్యం- దౌర్భాగ్యంతోటే చనిపోయుంటాడు. మూడు సంవత్సరాల క్రితం అనుకుంటా- కలిశాడు. ముషీరాబాదు నుంచి కవాటిగూడాకు మారేమని చెప్పాడు. తరువాత వేరే వాళ్ళ ద్వారా విన్నాను. అతని భార్య అతన్ని వొదిలేసి ఎవరో_నో పోయింది. ఆ షాక్ నుంచి తేరుకోలేక పోయ్యాడను కుంటా-" నిట్టూర్చేడు విజయబాబు.

నివ్వెర పోయాను. కాలగతిన స్నేహపథం నుంచి జారిపోయిన మిత్రుణ్ని వెదుక్కుందా మనుకుంటున్నాను. పోయాడా!!

ఆ వార్త మనసును కలచి వేసింది. చాలా సేపు మౌనంగా వుండి పోయాము.

తరువాత మాట్లాడబోతే నా గొంతు దగ్గుత్తిక బడింది. పండరి పోయాడు. అతని కుటుంబ సభ్యులు-? భార్య సరే- పిల్లలు లేరా?

విజయబాబుకు ఆ వివరాలు తెలీవు. తెలియవని చెబుతూంటే అతని ముఖాన అపరాధ భావం అలుముకుంది.

మర్నాడుదయం విజయబాబూ నేనూ కలసి కవాటీగూడా వెళ్ళేము.

వాళ్ళనూ, వీళ్ళనూ అడిగి తెలుసు కున్నాము. పదకొండింటి కల్లా ఓ కాలవ పక్కనున్న ఆ గుడిసెను కనుక్కున్నాము.

మేం ఆ యింటి ముందు తచ్చాడటం గమనించి పొరుగు గుడిసె కుర్రాడు ఒకడు వచ్చి- మేం వచ్చిన పని ,తెలుసుకుని కాసేపు ఆలోచించి రివ్వున పరుగెత్తాడు.

కాసేపట్లో వచ్చింది పండరి తల్లి- అనుమానంగా, సందేహంగా, భయంగా మా వంక చూస్తూ.

మా దగ్గరికి వచ్చేక మౌనంగా ప్రశ్నార్థకంగా మా యిరువుర్నీ మార్చి మార్చి చూసింది.

ఆమె నన్ను గుర్తు బట్టలేదు. కానీ ఆమెను చూసేక నే నామెను మరచి పోయినట్లే అన్పించ లేదు. కండ్లకి బాగా దిగువ దాకా.విస్తరించిన ఆ నల్లని వలయాలు విజయబాబు చెప్పిన- చెప్పని కథనంతా వివరిస్తున్నాయి.

నేనే చొరవ తీసుకుని అన్నాను- "నేనమ్మా- నువ్వు నన్ను గుర్తు బట్ట లేదు. పండరి చిన్న నాటి స్నేహితుణ్ని- రాధాకుమారని- "రాధ" అని పిలిచే వాడు పండరి."

ఆమె చూస్తోంది గుర్తు చేసుకుంటూ.

"ముషీరాబాదులో మీరున్నప్పుడు పండరితో బాటూ వస్తూండే వాణ్ని- మీ యింట్లో చాలా సార్లు అన్నం గూడా తిన్నాను. మీరు మరీ బలవంతం చేసి తిన్పించేవారు- ఆ రాధని!"

ఆమె అయోమయంగా చూసింది. ఆ కొన్ని క్షణాల్లో ఎన్ని సంవత్సరాల గతం విహ్వల మనోవేగంతో ఆమె మనస్సులో రివ్వున కదలిందో! ఆ పోయిన తన కుమారుడి జీవిత విశేషాలు ఎన్ని ఆ జ్ఞాపకరంగాన రెప రెప లాడేయో! ఎన్ని ముద్దులు- ఎన్ని నవరసపూరిత అమృత స్మృతులు ఆ గుండెలో గుబగుబ లాడేయో! తెలీదు గాని.

క్రమంగా ఆమె కళ్ళ నుంచి అమృత వృష్టి లాంటి వాత్సల్య దృష్టి ప్రసరిస్తూ నన్ను తడిపి వేయసాగింది. నా శరీరం మళ్ళీ చిగురించ సాగిన మోడులా పులకరించింది.

"ఓ! నాయినా- నువ్వా!?" అన్న దామె. "రాద- రాద- ఔ రాద" అంటూ నెమ్మదిగా గుర్తు చేసుకోసాగింది. "ఎప్పటి దినాలు! ఎప్పటి కాలం! నాయినా! పండర్ని ఆ బగమంతుడు దీసుకు పోయిండు నాయినా! తండ్రీ- దేవుడు నా బిడ్డడ్ని ఎత్తుక పొయిండు నాయినా!"

ఆమె కళ్ళు పొంగేయి. ఆ అశ్రుధార జీవ నదిలా కన్పించింది.

నదీ తీరాన చెలమలాగ నా కళ్ళల్లోనూ బాష్పం ఉబికింది. సంతోషం! నా కంటికీ- హృదయానికీ బంధం యింకా సడల లేదన్న మాట!

చప్పున కన్నీళ్ళు తుడుచు కుందామె. తలుపు తీసింది. కానీ అంతలోనే తటపటాయించింది- "లోని కొస్తావా నాయినా?"

ఆ గుడిసె తలుపు వినమ్రభావం నేర్పింది. వొంగి యిద్దరమూ లోపలికి నడిచేము.

గోడమీద- పండరి! పండరి చిన్నతనం నాటి ఫోటో - మెట్రిక్ పరీక్ష కోసం దిగింది లాగుంది- పెద్దది చేయించారు.

ఆ ఫోటోలో నుంచి ఆ స్నేహపూరిత మైన కండ్లు నన్ను మళ్ళీ తమ యింటికి ఆహ్వానించేయి కొన్ని యేళ్ళ తరువాత.

ఆ కళ్ళలోకే చూస్తూ వుండిపోయాను.

గబగబ మూలనున్న చాపని తీసి పరిచిందామె- "కుసోండి నాయినా- ఎంత దయతో- ఎంత మాలిమితో వొచ్చిన్రో కసింత "చా" యైన తాగుదురు-" అని తడికచాటుకు పొయ్యి రాజెయ్య డానికి వెళ్ళింది.

"ఊహుఁహుఁ- ఇప్పుడవన్నీ పెట్టుకోకు-" వారించబోయాడు విజయబాబు.

"అన్నీ యేవుంది నాయినా- చాయేగా-" అన్న దామె.


మేం టీ తాగుతూంటే ఆమె వివరంగా చెప్పింది.

పండరి క్షయ రోగంతో పోయాడు- ఇద్దరు మగ పిల్లలు- పిల్లల్ని చదివించాలని- వాళ్ళకి బాగా చదువు రావాలని తాపత్రయ పడేవాడు. పెద్ద పిల్లాడ్ని బళ్ళో వేయకముందే పోయాడు. రోగం పుణ్యమాని కన్న పిల్లల్ని మనసుతీరేలా దగ్గరకు తీసుకోడానికి గూడా సాహసించేవాడు కాదు. ఆ పిల్లల తల్లి- సరే- ఆ మహాతల్లి అసలెక్కడుందో గూడా తెలీదు. జంతువులే నయం పిల్లల్ని కని వొదిలేయవు- సాకుతాయి.

"మరి పిల్లలు- ఏరమ్మా?" అడిగేను.

ఆమె కళ్ళు తృటికాలం మెరిసేయి- "బడికి బోయినారు నాయినా- పండరి ఆకర మాటదే- నా పిల్లల్ని సాళెకు దోలాల- సాళెకు దోలాలని కల్వరిస్తానే కన్ను మూసిండు తండ్రి" పళ్ళు బిగబట్టి కష్టంతో దుఃఖాన్ని పొంగనీయకుండా ఆపింది. -"షరీకు జేసినగా నాయినా- బళ్ళో షరీకు జేసినగా- వాన్ల కోసమే యీ కట్టెనింకా సాగదీస్తున్న."

బడికి పంపడమంటే- ఎట్లా? పుస్తకాలు, బట్టలు, ఫీజులు! ఎట్లా? మరి యింట్లో తిండి- తిప్పలు? ఎట్లా? ఎట్లా?- ప్రశ్నలన్నీ నా



గొంతులో నే గడ్డకట్టి పోయాయి.

రోడ్డుదాకా మమ్మల్ని సాగనంప డానికి వచ్చిందామె. పిల్లలకు బాగా చదువు అబ్బు తూందనీ, బుద్ధిమంతులనీ చెబుతూంటే ఆమె కళ్లల్లో కొత్త జీవం కన్పించింది.

ఆ ఫోటో లోంచి పందరి అంతా వింటూన్నాడేమో! అందుకనేనా ఆ కళ్ళలో ఆ తృప్తి! అన్పించింది.

నా చేయి జేబులో తటపటా యిస్తోంది. ధైర్యం చేసి వంద రూపాయల నోటు తీసేను. "ఉంచమ్మా– పిల్లల కేమైనా కొని పెట్టు–"

ఆమె భయపడినట్టు చేతులూపుతూ వారించింది– "వొద్దు– వొద్దు నాయినగారూ."

"నాయినగారూ!" తల కొట్టేసినట్లుంది నాకు– "తీసుకోమ్మా– ఫర్వాలేదు– నీ బిడ్డలాంటి వాణ్ణే నేనూ–"

"తప్పు నాయినా– నువు యాదికి బెట్టుకుని వచ్చుకమే జాలు– నీ కెందరు బిడ్డలు సాయినా?"

చెప్పేను ఇంకా పెళ్లి చేసుకోలేదని– మళ్లీ అర్థించేను.

ఆమె చాలా మృదువుగా మాట్లాడింది గాని స్థిరంగా తిరస్కరించింది.

ఏం చెయ్యాలో తెలీలేదు. వ్రేళ్ల మధ్య ఆ వంద రూపాయల నోటు తిరస్కృత సుందరిలా బుసకొడ్తూంది.

హోటలుకు వచ్చేశాము– అపరాధుల్లా– మౌనంగా– తలలు వొంచుకునే.

నా మనస్సులో ఆ వృద్ధభిక్షుకి మెదలింది. కట్టుకున్న వాడు వొదిలేస్తేనో – కన్న బిడ్డలు పట్టించుకోక పోతేనో – ఆత్మాభిమానం చంపుకుని జీవిక కోసం యాచనకు సిద్ధపడ్డ దొక స్త్రీ–

కన్న తండ్రి కన్ను మూసి, కన్నతల్లి గాలికి పిల్లల్ని వొదిలి వొంటి సుఖం చూసుకోగా– వృద్ధాప్యంలో యే అగచాట్లు పడుతూ ఆ పిల్లల్ని పెంచుతూందో గాని, అయిన వారి నుంచి సానుభూతిని మాత్రం స్వీకరించి– ధనాన్ని తిరస్కరించింది మరో స్త్రీ!

ఆ రాత్రి నాకో చిత్రమైన కల వచ్చింది. తొలిసారిగా నా తల్లి కన్పించింది. నాలాగే ఆమె పొడుగరి. కన్నూ ముక్కూ చెవీ– కవళికలు– రంగూ– నాలాగే వుంది. అయితే ఆమె తలపైన జుత్తు బదులు పాపిటికి రెండు వైపులా పెంకులు కప్పి వున్నాయి. ఆమె గుండె మీద సగం విరిగిన తలుపులతో తెరచిన ద్వారం వుంది. చేతులూ– బుజాల మీద– మొండి గోడల మీద మొలచినట్లు పలచగా గడ్డి మొలచి వుంది. అక్కడక్కడ ఎముకలు కొద్దిగా బైటికి వెళ్ళు కొచ్చేయి.

ఆ కలకు అర్థం యేమిటో గాని నా మనసు వికలమైంది.

మిగిలిన వారం రోజుల్లో మరి కొందరు మిత్రుల్ని కలుసుకున్నాను.

ఆదివారం నాడు వెళ్లి పందరి పిల్లల్ని చూసి వచ్చేను. చెరొక రెండు జతల బట్టలు కొని యిచ్చేను. ఈ సారి మాత్రం ఆ అమ్మ కాదనలేక పోయింది.

తిరుగు ప్రయాణానికి ముందు ఎందుకనో అన్పించింది. వెళ్ళే ముందు మరోసారి ఆ వృద్ధ భిక్షుకిని చూడాలన్పించింది. "బిడ్డా!" అన్న మాట ఆ నోటితో మరో మారు అన్పించు కోవాలన్పించింది.

ఆ మాటే ఖదీర్‌తో అన్నాను– "ఒక్కసారి చూడాలన్పిస్తోంది ఖదీర్‌భాయ్"

సానుభూతితో తల పంకిస్తూ అన్నాడు ఖదీర్– "ఎక్కడుందో – ఏ ఫుట్‌పాత్ మీద కన్ను మూసిందో! అనారోగ్యం పాలైందో యేమొ– ఎండకూ వానకూ చలికీ గురయ్యే ఆ శరీరం ఎంత కాలం మనుతుంది!?"

నా కెందుకనో మరో నాలుగు రోజులు వుండి వెళ్దామన్పించ సాగింది. ఉన్నట్లుండి ఆ ఆలోచన యెందుకు వచ్చిందో! తటపటా యిస్తూనే ఆ మాట ఖదీర్‌తో అన్నాను.

అతను తృళ్లిపడ్డట్లు కన్పించేడు– "నీ కేమైనా కాలేదు గదా!" అన్నట్లు చూశాడు నా వైపు– "నా ప్రోగ్రాం అయితే ఫిక్స్ అయిపోయింది. నీ యిష్టం– నువ్వీ మాట ముందే అని వుంటే నేను ఫ్లైట్ తీసుకునే వాణ్ని–"

మిత్రు లందరం కలసి భోజనం చేసి నాంపల్లి స్టేషనుకు బయల్దేరాం– రాత్రి తొమ్మిది గంటలకు బొంబాయి ఎక్స్‌ప్రెస్– ఈ సారి ఖదీర్‌భాయ్ కూడా నాతో బాటు రైల్లో ప్రయాణం చేయడాని కంగీకరించేడు.

నాంపల్లి స్టేషను దగ్గర గుండ్రటి ఆ చమన్ దగ్గరకు రాగానే ఆ గొంతు మళ్లీ విన్పించింది. "బాబా– దేవుడు మీకు మేలు చేయాలి– ఈ దీనురాలిపై కనికరం చూపండి బాబా–"

నా కాళ్ళు మంత్రం వేసినట్లు ఆగిపోయాయి. అటు వేపే చూస్తూ నిల్చుండి పోయాను. నా చేయి జేబులో తగిలిన ఒక కరెన్సీ నోటును పట్టుకుని సిద్ధంగా వుంది.

మా వేపు వస్తుందేమోనని చూస్తున్నాను.

ఆమె చీదరించి కొడ్తూన్న ఒక ప్రయాణీకుడ్ని యాచిస్తూ వెంటబడు తూంది.

రవి నన్ను గమనిస్తున్నట్లున్నాడు– "పద పద– ఆ ఛీట్‌కి దానం చెయ్యకపోతే నీ కొచ్చే పుణ్యమేమీ జారి పోదులే–"

"ఛీట్!" నాకు కష్ట మన్పించింది– "మరీ అంత నిర్దయగా మాట్లాడకు రవీ– ఎవరి భాగ్యం ఎప్పుడెట్లా మారుతుందో ఎవరు చెప్పగలరు."

ఇంతలో రాంరెడ్డి అందుకున్నాడు– "రంజాన్ నెలగదా– బాబా ఫోటో ఒకటి చేతబట్టింది. సెంటిమెంట్‌ని టికిల్ చేసి డబ్బు లాగడానికి–"

క్రిస్టోఫర్ కూడా నవ్వేడు గానీ ఆ నవ్వులో కొద్ది సానుభూతి ధ్వనించింది. "చేదుగా వున్నా నిజమే అది" అన్నట్లుంది ఆ నవ్వు.

ఆ మనిషిని గురించి అటువంటి మాటలు వినడానికి– నమ్మడానికి మనస్సు తిరస్కరిస్తూంది.

'నో నో నో– ఆమె అట్లాంటి మనిషి కాదు. ఆమె పరిస్థితి యేంటో! జీవితంలో ఏ వొడిదుడుకులు– ఏ నిర్దాక్షిణ్యమైన మలుపులు యిట్లా యాచనకు దిగజార్చేయో! ఎవర్నించి, ఎందర్నించి, ఎట్లా దగా పడిపోయిందో!' – నేను. అనాలనుకున్న మాటలన్నీ వాళ్ల చెవిన బడటం తమకిష్టం లేదన్నట్లు గొంతులో నే అణగిపోయాయి.

అప్పుడు నా మనసులో ఒక ఆలోచన తళుక్కుమన్నది. నాకు వచ్చిన కలకు 'నిజమైన' అర్థం స్ఫురించసాగింది.

ఆశ్రమం అరుగులపైన అనాథ శిశువుగా ప్రారంభమైన నా జీవితం సంక్షిప్త సారాంశం మనసులో మెదలింది. ఎందరు దాతల దాన ధర్మాలపై ఆధారపడి మేము అనాథాశ్రమంలో బ్రతికేమో, యాచన నుంచి వచ్చిన ఆ ధనం మా జీవితాలకు మార్గం చూపలేదూ! పెంకులు కప్పిన ఆ అనాథాశ్రమం– నా కన్నతల్లి ఆమేకదూ! అన్నార్తులు– అనాథశిశువులను హృదయానికి హత్తుకొన్న ఆ తల్లి గుండె ద్వారం తెరచివున్న మాతృమందిరం కదూ! కన్నతల్లి మా గురించి పదిమందినీ యాచించలేదూ!?

అప్పుడుగాని గుర్తుకురాలేదు. నన్ను 'కని'– పెంచి పెద్ద జేసిన అనాథాశ్రమాన్ని దర్శించుకోకుండానే వెళ్లిపోతున్నాను నేను!

సిగ్గుతో తలవాలిపోయింది నాకు. బిచ్చాలెత్తి నన్నొక గుర్తింపు పొందిన మనిషిగా పెంచిన ఆ పెంకుటింటి తల్లి ఋణం తీర్చుకున్నానా నేను

"రవీ–" కణతలు నిమురుకున్నాను నేను– "నేనొక ముఖ్యమైన పని మరచే పోయాను– నా ప్రయాణం వాయిదా వేసుకోవాల్సి వస్తోంది."

మిత్రులు ఆతృతతో చూసేరు.

## నాగరికతారణ్యం

ఇది అరణ్యం
మానవతా వసంతం
పొగొట్టుకున్న జనారణ్యం!
నాలుకల మీద ప్రేమ శోధాలు
నిర్మిస్తున్న నటనారణ్యం!
పలకరింపుల మధ్య
కరచాలనాల మధ్య
కరెన్సీ ధ్వనులు వింటున్న
కర్ణ శ్రవణారణ్యం
అన్నా! ఇది సర్వ కల్మషవాహిని!
మూసీ నదితో సమానిని!!

– "కోవెరె"

ఆ వృద్ధభిక్షుకి అమూల్యమైన కర్తవ్యాన్ని గుర్తు చేసింది. ఏది? ఏది ఆమె

అటూ ఇటూ చూసేను.

బారలు వేసుకుంటూ వెళ్తున్న ఓ విదేశీ యాత్రీకుని వెంటపడి యాచిస్తూ– పరుగులాంటి నడక నడుస్తూ వెళ్తోంది రాయల్ హోటల్ దిసెగా.

ఆదుర్దాగా అడుగుతున్నారు మిత్రులు.

ఏం చెప్పను? చెబితే అర్థం చేసుకోగలరా.? నవ్వకుండా– నవ్వుకోకుండా వుండగలరా

వీడ్కోలు చెప్పటానికి వచ్చిన బంధు మిత్రుల సమూహంలోంచి ఖదీర్ నన్ను వెదుక్కుంటూ వచ్చేడు.

చెప్పేను. "చాలా ముఖ్యమైన పని ఖదీర్‌భాయ్– మరచిపోయాను. ఆగిపోతున్నాను– సారీ నా నుంచి నీకు అసౌకర్యం అయింది"

"అరరె!!" విస్తుపోయాడు ఖదీర్– "అదేంటీ?" అన్నాడు సగం ప్రశ్నగా సగం ఆశ్చర్యంగా.

ఇక ఎక్కువ వివరించలేదు నేను. ట్రయిను కదిలిందాకా. అన్యమనస్కంగానే అతనికి కంపెనీ యిచ్చేను.

"అయితే ·యింతకీ ఎప్పుడొస్తున్నట్టు?–" ట్రయిను కదిలేక అడిగేడు ఖదీర్.

"నీకు జాబు రాస్తాను" అన్నాను చేయి వూపుతూ.

మిత్రులతో కలసి తిరుగుముఖం పట్టేను.

రాయల్ హోటల్ మూల నుంచి ఆబిడ్స్‌కు పోయే మలుపు దగ్గర జంక్షన్‌లో ట్రాఫిక్ స్తంభించి పోయివుంది.

జనం గుమిగూడి వున్నారు. మేము వెళ్ళి చూశాము.

"రోడ్డు దాటుతూ డబుల్‌డెకర్ కిందపడి పోయింది–" చెబుతున్నాడో వ్యక్తి.

"మొత్తం శరీరం నజ్జునజ్జైపోయింది– ముఖం గూడా ఆనవాలు తెలీదంలేదు–"

ఆదుర్దాగా నలుగురైదుగుర్ని నెట్టుకుని వెళ్ళి మునుగాళ్ళపైనిల్చుని చూసేను.

షాక్ యిస్తూ– నీడలతో నెత్తురుతో కలిసి పోయిన ఆ బురఖా కన్పించింది. వృద్ధ భిక్షుకి– ఐదూ పది పైసలిచ్చిన ప్రతి వ్యక్తికీ 'దేవుడు మీకు మేలు చేయా'లంటూ అమూల్యమైన దీవెనల్నిచ్చిన వృద్ధభిక్షుకి

"ఓ గ్యాడ్! ఓహ్– మైగ్యాడ్!!"

ఆ చేతుల్లోంచి జారిపోయిన డబ్బాలో నుంచి నాణేలు చెల్లాచెదురుగా పడిపోయాయి– 'ఇక వీటి విలువ ఎంతో మీరే చూసుకోండి' అన్నట్టు.

ఆమె నిర్జీవహస్తాలు కాబా ఫొటోను మాత్రం గట్టిగా పట్టుకునే వున్నయ్– యీ స్థూల ప్రపంచాన్ని కతాను నమ్మనంటున్నట్టు.

మిత్రులు గూడా నివ్వెర పోయారు.

అరగంట సేపట్లోనే మా విమర్శలనూ– పరిహాసాన్నీ మా ముఖాలపైకే గిరాటేసి నెత్తురుచుక్క లేకుండా చేసి పోయింది నెత్తుటి ముద్దైన ఆ బురఖా తల్లి!

* * * * * *

ఎవరినీ వెంట తీసుకెళ్ళకుండా నేనొక్కణ్ణే నా పెంపుడు తల్లిని చూడటానికి వెళ్ళేను.

అంత దూరం నుంచి చూడగానే నా కళ్ళు మసక బారేయి.

సగం పగిలి పోయిన పెంకులూ– బెచ్చెలు బెచ్చెలుగా సున్నం గచ్చురాలిపోయిన గోడలూ ఆ స్థితిలో వుంది– వృద్ధాప్యంలో నాలాంటి బిడ్డలు ఆదుకోకుండా వొదిలేసిన ఆ తల్లి:

అనాధలు, అభాగ్యులు, మాతృహీనులు, కన్నతల్లి మోసానికి గురైన చిన్న పిల్లలు– అందరినీ– 'అంతా నా పిల్లలే' అంటూ చేరదీసే అనాధమాత– తాను స్వయంగా అనాధలా దీనంగా– దిగ్విహీనంగా కన్పిస్తోంది.

నేను తిరిగి అమెరికా ఎందుకు వెళ్ళాలో అర్థం కాలేదు. ఎందుకు వెళ్ళకూడదో మాత్రం అర్థమవుతూన్నట్లన్పించింది.

'యాచన చేయడం ఎవరికీ సంతోషదాయకమైన పనికాదు బాబా– బిచ్చగాళ్ళలో నూటికి ఎనభైమందైనా ఆ వృత్తిని చివరి మార్గంగా చూసుకున్న వాళ్ళే– వాళ్ళలో యింకా మనుష్య స్వభావం– ఉహుఁ– మానవత్వం– మిగిలిపోయింది కనుకనే దొంగలు కాకుండా, హంతకులు కాకుండా– యాచకులుగా స్థిరపడిపోయారు. బాబా– ఒకసారి పరీక్షగా వాళ్ళ కళ్ళల్లోకి చూసి చూడు– చనిపోయిన ఆత్మాభిమానపు నిర్జీవకళ ఎట్టా కొట్టొచ్చినట్టు కన్పిస్తుందో! 'మేం నోచుకోని వాటికి మీరైనా నోచుకోండి' అంటూ కారు చౌకగా వాళ్ళు మీకు ప్రసాదించే దీవెనలలో మోసం విన్పిస్తోందా– నిస్సహాయుల ఘోష ధ్వనిస్తోందా?....

ఆకాశంలో ఎక్కణ్ణుంచో– అశరీరవాణిలా ఆ తల్లి అంటూన్నట్టు– ఆ మాటలు నా గుండెలో మారు మ్రోగుతూనే వున్నయ్.

శుష్కమైన మనస్సుతో నాలుగు రోజులు ఎటూ కదలలేక పోయాను.

శనివారంనాడు బొంబాయి వెళ్ళాల్సిన వాణ్ని– మరుసటి శనివారంనాడు దేవాలయం నుంచి సరాసరి కవాటీగూడా వెళ్ళేను.

ఈ సారి పండరి పిల్లలు యింటి ముందే కన్పించేరు– స్కూలుకు వెళ్ళకుండా ధిగాలుగా పడ్డ మొగాలతో.

వాకబు చేస్తే తెలిసింది– వాళ్ళ నాయనమ్మ– పండరి తల్లి– ఎటు పోయిందో తెలీదు– వారం రోజులైంది జాడ తెలీక! ■

# న్యాయపీఠం



వి.బి.రావు. ఎమ్.ఏ.ఎల్ఎల్.బి.

## భార్యకు తాత్కాలిక భరణం ఇవ్వాలి

ఢిల్లీలోని మేజిస్ట్రేట్ కోర్టులో సావిత్రి తన భర్త అయిన గోవిందసింగ్‌పై తన పోషణ కోసం ప్రతి నెలా భరణం చెల్లించాలని దావా వేసింది. అంతే కాకుండా దావా పరిష్కారం కావటానికి కొంతకాలం పడుతుంది కనుక తాత్కాలిక భరణం మంజూరు చెయ్యవలెనని మరో పిటిషన్ పెట్టుకున్నది. కానీ ఈ పిటిషన్‌ను మేజిస్ట్రేట్ తిరస్కరించారు. దానిపై సావిత్రి సుప్రీమ్ కోర్టు వారికి అప్పీలు పెట్టుకున్నది.

క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని 125 సెక్షన్‌లో తాత్కాలిక భరణం మంజూరు చేయాలని లేదు. కానీ తాత్కాలిక భరణం మంజూరు చేయకూడదని కూడా లేదు అని సుప్రీమ్ కోర్టువారు అభిప్రాయ పడ్డారు. 125 సెక్షన్ ప్రకారం ఎవరైనా తన భార్యను పోషించడానికి నిరాకరించినా లేదా తన పిల్లలను పోషించడానికి నిరాకరించినా లేదా తన పిల్లలు మెజారిటీ తీరినప్పటికి అంగ వైకల్యం కలిగి ఉన్నచో అట్టి పిల్లలను పోషించడానికి నిరాకరించినా లేదా తండ్రిని గాని, తల్లినిగాని పోషించడానికి నిరాకరించినా అతను నెలకు ఐదు వందల రూపాయల వరకు భరణం చెల్లించాలని మేజిస్ట్రేటు ఆర్డరు జారీ చేయవచ్చును. కానీ 125 సెక్షన్ క్రింద పెట్టుకున్న అప్లికేషన్లు పరిష్కారం జరగటానికి కొన్ని నెలలు పడుతుంది. అంతవరకు తనను తాను పోషించుకోలేని దరఖాస్తుదారు బ్రతికి ఉండాలికదా, అందుచేత తాత్కాలిక భరణం మేజిస్ట్రేటు మంజూరు చేయవచ్చును. తాత్కాలిక భరణం మంజూరు చేయడానికి గల కారణాలు వివరిస్తూ దరఖాస్తుదారునకు ఒక ఎఫిడవిట్ దాఖలు చేసుకోమనవచ్చును. దానిపై మేజిస్ట్రేట్ తాత్కాలిక భరణం మంజూరు చేయవచ్చును. ఎఫిడవిట్‌లోని కారణాలు నిజంకావని మేజిస్ట్రేట్‌కు తోచినపక్షంలో తాత్కాలిక భరణం ఎప్పుడైనా నిలుపు చేయవచ్చును. 125 సెక్షన్ క్రింద మేజిస్ట్రేట్‌కు ఈ అధికారం ఉన్నదని 1986 లో సుప్రీమ్ కోర్టు వారు తీర్పు చెప్పారు. ■